# కాగితాల సమాధుల్లో మనుషులు

పరుగెత్తుతున్న రైల్లో నుంచి దిగాలుగా చూస్తూ కూర్చున్నాడు కామేశం.

ప్రపంచమంతా వెనక్కి పరుగెత్తుతోంది. తను ముందుకు దూసుకుపోతున్నాడు.

అంటే....మళ్ళీ ట్రాన్స్‌ఫరై ....మళ్ళీ పెట్టేబేడా సర్దుకుని.... మళ్ళీ దేశాలు పట్టుకుని...ఛీ-ఛీ—

అతను కూర్చున్న పెట్టె జల్లెడను కుదిపినట్టు కుదుపుతోందతన్ని. జేబులోనుంచి మళ్ళీ టెలిగ్రాం కాగితాన్ని తీసి చదువుకున్నాడు.

"యువర్ ట్రాన్స్‌ఫర్ ప్రపోజ్డ్ ఫ్రం నంద్యాల టు ప్రొద్దుటూర్. స్టార్ట్ యిమ్మీడియెట్లీ—శేషగిరిరావు."

సదరు శేషగిరిరావు కామేశం పనిచేస్తున్న డిపార్టుమెంట్ హెడ్డాఫీస్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్ యు.డి.సి.

మొన్న మొన్ననే ఓసారి కామేశం స్నేహితుడు రాజేంద్ర ప్రసాద్ ప్రమోషన్ పైరవీ సందర్భంగా అతనితో హైదరాబాద్ వచ్చినపుడు...యు.డి.సి. శేషగిరిరావును సాయంకాలం బార్‌లో బీర్‌తో కాకా పట్టిన శుభసమయంలో అతను పరిచయం చేశాడు.

ఆ రోజు శేషగిరిరావు చూపిన చురుకుదనం కామేశంను ఉక్కిరి బిక్కిరి చేసింది. రాజేంద్రప్రసాద్ ప్రమోషన్ విషయమై చాలామందికి తెలియని కొన్ని అతిముఖ్యమైన రూల్సును తీసి ముందరపెట్టి, ముళ్ళ బాటను పూలబాటలా చేశాడు. రాజేంద్రప్రసాద్‌తో అతి ఫ్రాంక్‌గా కొంత మొత్తాన్ని టోకురేటున కుదుర్చుకుని ఓ నెల రోజుల్లో ప్రమోషన్ వచ్చేట్టు చేశాడు.

శేషగిరిరావుకు రాజకీయంగా పలుకుబడివుంది. అతనికి ఎందరో ఎమ్మెల్లేలూ, కొందరు మంత్రులూ తెలుసు అని అందరూ అనుకుంటూంటారు. రాజేంద్రప్రసాద్ ప్రమోషన్ విషయంగా శేషగిరిరావు ఎవరితో ఫోన్లు చేయించాడో, ఏ మంత్రి పలుకుబడిని వాడుకున్నాడో తెలియదుగాని ప్రమోషన్ మాత్రం యిప్పించాడు. అనుకున్నట్టుగా వేయి రూపాయలు తీసుకున్నాడు. అప్పుడే అతని అసమానమైన పలుకుబడికి ఆశ్చర్యపడి కామేశం కూడా ప్రత్యేకంగా శేషగిరిరావు స్నేహం ఎప్పటికైనా శ్రీరామరక్షలా వుంటుందని ఓ నాల్గు బీర్లతో అతని హృదయాన్నభిషేకించి ప్రసన్నుణ్ణి చేసుకున్నాడు.

అప్పటి ఆ స్నేహాన్ని పురస్కరించుకుని...యిప్పుడు అతని క్షేమార్థం శేషగిరిరావు యిచ్చిన టెలిగ్రాం-పిచ్చుకను తరుముతున్న బ్రహ్మాస్త్రంలా అతన్ని రైల్లో కూర్చుండబెట్టి, హుటాహుటిని హైద్రాబాద్‌కు కిక్ కొట్టించింది.

రైలు సికింద్రాబాద్ స్టేషన్‌లో యింకా పూర్తిగా ఆగకముందే చటుక్కున దుమికి గబగబా ఆటోదగ్గరకు ఉరికి....అర్జంటుగా అందులో కూలబడి "పోనీ"మన్నాడు. అతని మనసు బోనులో పడ్డ ఎలుకలా వుంది.

పదినిముషాల్లో ఆటో హెడ్డాఫీస్ ముందాగింది. యీలోగా జేబు లోని టెలిగ్రాంను మళ్ళీ ఓ ఐదారుసార్లు తీసి చూచుకున్నాడు.

గబగబా శేషగిరిరావు సీట్ దగ్గరకు పరుగెత్తి చేతిలోని బ్రీఫ్ కేస్‌తోసహా....బిక్కముఖంతో ప్రత్యక్షమై 'హే పాహిమాం....పాహి మాం' అన్నట్టు అతిదీనంగా చూశాడు.

సరిగ్గా ఆ క్షణంలో శేషగిరిరావు ఓ ఫైల్‌ను తెరిచి...కొత్తగా ఓ నోట్ కాగితాన్ని ఫోల్డ్‌చేస్తూ...పెన్నును చేతిలోకి తీసుకుని....ఎదు రుగా ప్రత్యక్షమైన కామేశం వంక విర్లిప్తంగా చూచి "కూర్చోండి" అన్నాడు.

కామేశం చటుక్కున కూలబడ్డాడు.

"ఎప్పుడొచ్చారు?" "యింకా రాలేదు ... యిదిగో వస్తు న్నాను..."

"ఊఁ...." శేషగిరిరావు నోట్ రాయడం ప్రారంభించాడు.

కామేశం కళ్ళు ఆత్రంగా చూస్తున్నాయి అతను రాయబోతున్న దాన్ని.

"మీ రిచ్చిన టెలిగ్రాం..." ఏదో అనబోయాడు.

"యిష్...." అని సన్నగా అరిచి...చుట్టూ భయంగా చూచి 'యూ ఫూల్' అన్న భావం ధ్వనించేట్టు చూపులను గుచ్చేడు శేషగిరిరావు

కామేశం అదిరిపడ్డాడు.

"యాజ్ శ్రీ రాంనర్సయ్య అసిస్టెంట్ లెక్చరర్ ఫ్రం ప్రొద్దు టూర్ సెంట్ ఫర్ మద్రాస్ ట్రెయినింగ్ ఫర్ టు యియర్స్ శ్రీ కామేశం అసిస్టెంట్ లెక్చరర్ ఫ్రం నంద్యాల మె బి పోస్టెడ్ ఎట్ ప్రొద్దుటూర్.

ఫర్ అప్రూవల్,..."

కామేశం రాయితో కొట్టబడ్డ కాకిలా ఐపోయాడు. తన ముందరే తన ఫైల్ పుటప్ ఔతుంది.

"శేషగిరిరావుగారు!... ఒక్కక్షణం వస్తారా బయటికి" అన్నాడు ధైర్యాన్నంతా కూడగట్టుకుని.

"ఆఁ...యీ మీ ఫైల్‌ను అసిస్టెంట్ డైరెక్టర్ దగ్గరికి పంపించి వస్తాను..." అని అతను అంటూంటే "ఆఁ అది అసిస్టెంట్ డైరెక్టర్ దగ్గరికి వెళ్ళాక నువ్వొచ్చి ఏం జేస్తావ్-నీ బొంద." స్వగతంగా సణుక్కుని పైకి "ప్లీజ్..." అన్నాడు తన వేదనంతా ధ్వనించేలా.

శేషగిరిరావు సీట్లోనుంచి లేచి సిగరెట్టు వెలిగించుకుని బయటికి నడిచి ఆఫీస్ అవతల రోడ్డుదాకా వచ్చి "ఊఁ చెప్పండి" అన్నాడు.

"మనం కాఫీ తాగుదాం" అన్నాడు కామేశం అతివినయంగా. "సరే పదండి" అని బార్లోకి దారి తీశాడు శేషగిరిరావు.

రెండు బీర్లు ఆర్డరిచ్చి—"చూడండి-మీరు రాజేంద్రప్రసాద్ ఫ్రెండని ఆ టెలిగ్రాం యిచ్చాను. నిజానికిది టాప్ సీక్రెట్! మరి మీరెలా డీల్ చేసుకుంటారో మీయిష్టం" అన్నాడు సీరియస్‌గా.

"నేనేం డీల్ చేస్తానండి? ఆ చేయవలసిన పనికి క్లూ ఏదో మీరే యివ్వాలి. నన్నీ ఆపదనుంచి గట్టెక్కించి పుణ్యం కట్టుకోవాలి. మీ దయ."

"మనమేంజేసినా యివ్వాళ సాయంకాలంలోగానే చేయాలి. రేపు ఆర్డర్స్ బయటికొస్తాయి, రావాలి."

"మరేం చేద్దామంటారు?"

''మీకెవరైనా ఎమ్మెల్లే తెలుసా? తెలుస్తే మినిస్టర్‌తో డైరెక్టర్‌కు చెప్పించండి. పనైపోతుంది.''

"ప్చ్! నాకే ఎమ్మెల్లే తెలుసండీ? మీరే చేయాలి ఏదైనా నా తరపున. యివి చేతులు కాదనుకోండి'' అని శేషగిరిరావు చేతులను పట్టుకున్నాడు.

శేషగిరిరావు అప్పుడే బేరర్ తెచ్చిపెట్టిన బీర్ సీసాను పట్టుకుని గ్లాసులో వంచుకున్నాడు. సీసా పూర్తయేదాకా తీవ్రంగా ఆలోచించి– అంతా ఐపోయిన తర్వాత బయట కలకత్తా పాన్ వేయించుకుంటూ– ''ఐతే మీరు సాయంత్రం ఆరుగంటలకు రండి మా యింటికి–అన్నీ చేద్దాం'' అని చరచరా వెళ్ళిపోయాడు విక్రమార్కుని దగ్గరనుంచి భేతాళునిలా

కామేశం బిక్కమొగంతో రోడ్డుపైబడి ఎండలో తిరిగి తిరిగి చివరికి ఓ లాడ్జింగ్‌లో చొరపడి ప్రొద్దంతా భయపడి భయపడి– సాయంకాలం సర్రిగ్గా ఆరుగంటలకు ఠంచన్‌గా శేషగిరిరావు యింటికి టాక్సీలో వెళ్ళి పిలిచాడు.

వెంటనే శేషగిరిరావు వచ్చి టాక్సీలో కూర్చుని ''పోనీ'' అన్నాడు. ముందుగా ఎమ్మెల్లే క్వార్టర్స్‌కు పోనిచ్చి కామేశంను ఓ క్వార్టర్ వాకిట్లోనిలబెట్టి లోపలకొచ్చి ఓ ఖద్దరు మనిషిని తీసుకొచ్చి టాక్సీను ఓ మినిస్టర్ యింటి దిక్కు–పోనీయమన్నాడు. కామేశం ముఖం తదియ చంద్రునిలా వెలిగింది.

మినిష్టర్ యింటిముందు దిగి ముగ్గురూ లోపలికి నడచాక ''మీరిక్కడ కూర్చోండి'' అని కామేశానికి విజిటర్స్ లాంజ్‌లో కుర్చీని చూపించి యిద్దరూ లోపలికి పి. యస్. గదిలోకి వెళ్లారు.

ఒకటి.... రెండు... మూడు... నిముషాలు గడుస్తున్నాయి. ఓ అర గంట తర్వాత శేషగిరిరావూ, ఖద్దరురావూ ఇద్దరూ హడావుడిగా బయట కొచ్చి "పదండి, మీ పనై పోయింది. రేపుదయం మినిష్టర్‌గారు మీ డైరెక్టర్‌కు ఫోన్ చేస్తాడు" అని ఖద్దరు మనిషి వేరే ఓ ఆటోలో కూర్చున్నాడు. వెంటనే శేషగిరిరావు ఆటోవానికి ఓ పదిరూపాయల నోటు అందించాడు ఫేర్ క్రింద. కామేశం తనివ్వబోయెంతలో ఆటో వెళ్ళిపోయింది

"మీరు రేపుదయం పదకొండు గంటలకు ఆఫీసుకు రండి" అని టాక్సీలో కూర్చుంటూ 'పోసీ' అన్నాడు శేషగిరిరావు.

కామేశానికి ఆనందంగా వుంది. యీ చకచకా పనులై పోవడం కలలా వుంది. అంతా సంతోషంతో కూడిన పిచ్చిగా వుంది.

శేషగిరిని యింట్లో దించి పదే-పదే కృతజ్ఞతలు తెలుపుకుని కామేశం లాడ్జింగ్ కొచ్చేసరికి పదయింది.

మర్నాడు-

కామేశం ఆఫీసుకు వెళ్ళేసరికి శేషగిరిరావు సీట్లోలేడు. కాస్సేపు కూర్చున్నాడు. ఓ పది నిమిషాల తర్వాత హడావిడిగా వచ్చాడు శేషగిరిరావు. వస్తూ వస్తూనే "వచ్చారా! ఇప్పుడే మినిష్టర్ ఫోన్ చేసాడు. డైరెక్టర్‌గారి దగ్గర్నుంచే వస్తున్నాను. మీపేరు తీసి వేరే పేరును ప్రపోజ్ చేయమన్నారు. కంగ్రాచ్యులేషన్స్" అని సీట్లో కూలబడి, క్రితంరోజు రాసిన నోట్ కాగితాన్ని ఫైల్లో నుండి డిటాచ్ చేసి పరపరా చించేశాడు కామేశం ముందే.

కామేశం ముఖం పున్నమి చంద్రునిలా వెలిగింది. ఆ వెలుగు గమనించి "పదండి బయటకి" అన్నాడు శేషగిరిరావు.

ఇద్దరూ మళ్ళీ బార్లోకొచ్చి... బీర్లు తెప్పించుకొని...సంగతి చర మాంకంలో వుండగా-

"వీటి మంచండి" అని కామేశం ఓ మూడు నూర్రూపాయల నోట్ల నందించాడు.

"ఎన్ని అవి?" అన్నాడు శేషగిరి మూడింటిని స్పష్టంగా చూస్తూ

"మూడండి." "తక్కువేమో!" ముఖంనిండా ఆశ్చర్యార్థకం.

ఇంకో నోట్‌ను జతచేశాడు. "రైట్" లేచి నిలబడ్డాడు శేషగిరి.

ఇద్దరూ బయటికొచ్చారు. ఈలోగా కామేశం పది పదిహేనుసార్లు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

కలకత్తా పాన్‌ను కామేశం కర్చుతో నోట్లో పెట్టుకుని- శేషగిరి ఆఫీస్ దిక్కూ, కామేశం లాడ్జింగ్ దిక్కూ పరమానంద భరితులై సాగిపోయారు.

x x x x x

ఆ రోజు రాత్రి-

శేషగిరిరావు తన అర్ధాంగి పక్కలో పడుకుని వేలికి అరతులం ఉంగరాన్ని తొడుగుతూండగా ఆమె అడిగింది "ఇదెక్కడిది డార్లింగ్?" అని.

"ఓ నంద్యాల పూల్‌కు లేని ట్రాన్స్‌ఫర్ గురించి ఓ టెలిగ్రామిచ్చి సంపాదించాను. వచ్చేవారం ఓ కాకినాడ మిత్రుని దగ్గర ఓ చైన్‌ను లాగుతాన్లే" అని గర్వంగా తొండలా యికిలించాడు.

సరిగ్గా అదే వేళకు కామేశం తన భార్యతో - "చూశావా - మన తడాఖా, నిన్న హైదరాబాద్ వెళ్లాను. ఇవ్వాళ ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ చేయించుకొచ్చాం. హౌ ఇన్‌ఫ్లూఎన్షియల్ ఐయామ్" అని బడాయి

కొడుతున్నాడు.

x x x x x

‘‘ఇక కథ అయిపోయిందా?’’ పాఠకుడు.

‘‘ఐపోలేదు_ ఐపోలేదు. నాకే విసుగొస్తోంది పాడు కథలు రాయలేక. వస్తా’’- రచయిత పరుగెత్తుతున్నాడు కలాన్ని భుజంపై మోసుకుంటూ యింకో ఆఫీస్ దిక్కు.